క్లుప్తంగా

అంకితభావంతో గుర్తింపు



వినాయకంను సన్మానిస్తున్న షఫీఉల్లా

పెద్దపంజాణి: అంకితభావంతో పని చేసే ప్రతి ఉద్యోగికీ మంచి గుర్తింపు లభిస్తుందని తులసమ్మగుడి ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం షఫీఉల్లా అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన వినాయకంను ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన పాఠశాలలో కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని ఆకాంక్షించారు. అలాగే పాఠశాలకు నూతనంగా విచ్చేసిన హెచ్‌ఎం షఫీఉల్లాను సైతం ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి, ఉపాధ్యాయులు హరిప్రసాద్, నాగవేణి, సచివాలయ సంక్షేమ అధికారి ఇబ్రహీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో బ్రిడ్జి కోర్సులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్

పుంగనూరు: శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23 వరకు ప్రత్యేక బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులకు, డిగ్రీ, పూర్తి చేసిన విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని కళాశాలలో చేపట్టామన్నారు. పోటీ పరీక్షల విధి విధానాలు, పరీక్ష పత్రాలపై అవగాహన, రాష్ట్ర, జాతీయ స్థాయి ఉద్యోగాల పరీక్షలకు సంబంధించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు బ్రిడ్జి కోర్సుల్లో చేరాలని కోరారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మృతురాలికి నివాళి



నివాళులర్పిస్తున్న అమర్‌నాథ్

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లి గ్రామానికి వైఎస్సార్ సీపీ నాయకులు అభ్రిష్ నానమ్మ మేల్ పిల్లమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తనయుడు అమరనాథ్ ఆ గ్రామానికి చేరుకుని పిల్లమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పీఈఎస్‌లో రాయితీతో వైద్యసేవలు

గుడుపల్లి: పీఈఎస్ ఆస్పత్రిలో డయాబెటిక్ ఎండోక్రైనాలజీ విభాగంలో రాయితీతో వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఈఎస్ సూపర్‌స్పెషాలటీ ఆస్పత్రిలో ఈనెల 31వ తేదీ వరకు రాయితీతో వైద్య సేవలు అందిస్తామన్నారు.

చెరువులో మట్టి తవ్వుతున్న హిటాచీ, పక్కన మట్టి రవాణాకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు



గతంలో కొత్తపల్లె సమీపంలోని పాలమాకుల చెరువులో మట్టి తవ్వకం పనులు (ఫైల్)



రోదిస్తున్న చెరువులు..!

మండలంలోని కొత్తపల్లెకు చెందిన టీడీపీ నాయకుడి మట్టి దందా తారాస్థాయికి చేరింది. అధికారం అడ్డుపెట్టుకుని చెరువులను యథేచ్ఛగా కొల్లగొడుతున్నాడు. రేయింబవళ్లూ తేడా లేకుండా హిటాచీతో మట్టి తవ్వడం, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించి జేబులు నింపుకుంటున్నాడు. ఇతడి దెబ్బకు పలు చెరువుల రూపురేఖలే మారిపోయాయి. అయినా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూడడం మినహా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

- చెరువులను చెరబట్టిన 'పచ్చ' నేత
- మట్టి వ్యాపారంతో జేబులు నింపుకుంటున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

గంగవరం: అసలే మండలాన్ని తీవ్ర వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. చెరువుల్లో చుక్క నీరు లేక పూర్తిగా ఆకాశం కేసి చూస్తున్నాయి. ఇలాంటి చెరువులపై కన్నేసిన టీడీపీ నేత మట్టి వ్యాపారానికి చెరువులు బావురుమంటున్నాయి. జేసీబీలు, హిటాచీలతో అడుగుల కొద్దీ లోతుతో మట్టిని తవ్వి తీయడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఒక చెరువు చెరువు మట్టిని పూర్తిగా కొల్లగొట్టిన తర్వాత మరో చెరువు ఎంచుకుని అందులోని మట్టిని పూర్తిగా ఖాళీ చేయడం, ఇలా ఒక దాని తర్వాత మరొకటి చొప్పున చెరువులను చెరబట్టి, మట్టిని కొల్లగొట్టి, జేబులు నింపుకుంటున్నాడు. ప్రస్తుతం మబ్బువారిపేట గ్రామ సమీపంలోని జంఒడ్డు చెరువులో నాలుగు రోజులుగా జోరుగా మట్టితీత పనులు చేస్తున్నాడు. ఈ పనుల మూలాన తమ పొలాల్లో సారం తగ్గిపోతుందని రైతులు మండిపడుతున్నా ఖాతరు చేయడంలో లేదు. చివరకు చెరువు చుట్టుపక్కల రైతులు దామోదర్, తిమ్మారెడ్డి, ప్రభాకర్ తదితరులు గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అంతేకాకుండా చెరువులో బీసీలకు సంబంధించిన శ్మశానాన్ని సైతం మట్టి తవ్వకం పనులతో ధ్వంసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

అక్రమ వ్యాపారంతో డబ్బే..డబ్బు..!

చెరువుల మట్టి వ్యాపారంతో అక్రమార్కులు లక్షలు ఆర్జిస్తున్నారని భారీ గుంతలమయమైన ఏ చెరువును చూసినా ఇట్టే బోధపడుతుంది. ఇసుక, మట్టి తరలింపుపై ప్రభుత్వ ఆంక్షలు ఉన్నాయి. అవసరాల నిమిత్తం చెరువులు, నదుల్లో మట్టిని, ఇసుకను తోలుకోవాలన్నా అనుమతి తప్పనిసరి పొందాలి. కానీ పాలక పక్ష నాయకులు మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా, దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురించినా అక్రమార్కులపై చర్యలు కాదు కదా..కనీసం మట్టి రవాణాను అడ్డుకున్న పాపానపోవడం లేదు. జిల్లా అధికారులైనా స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన అవసరం



తీర్థంలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్, వైద్యసిబ్బంది

బైరెడ్డిపల్లి: డెంగీ వ్యాధిపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని, అప్పుడే వ్యాధి నివారించేందుకు వీలవుతుందని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం అధికంగా ఉన్నా, చర్మంపై ఎర్రటి మచ్చలు రావడం, కీళ్లు, కండరాల నొప్పులు, వణుకు పుట్టడం వంటి లక్షణాలు ఉన్నప్పుడు దగ్గరలోని విలేజ్‌క్లినిక్‌లో గానీ, పీహెచ్‌సీలో గానీ రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారులను సంప్రదించినప్పుడు అవసమైయ్యే మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. నీటి తొట్టెలకు మూతలు ఉంచాలని, నిల్వ ఉన్న నీటిని గుర్తించి శుభ్రపరచాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. సాయంత్రం వేపాకు పొగ వేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, పీహెచ్ఎస్ శమంతక, హెచ్‌ఎస్ తిరుమలమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పీ సాయిదివ్య పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర



పట్టణంలో సత్యసాయిబాబా రథయాత్ర

వి.కోట : భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర మండలంలో ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర మంగళవారం పట్టణానికి చేరుకోగానే మండల సత్యసాయి సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ రథయాత్ర ముందు కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో రథయాత్ర ముందుకు సాగింది. సాయిబాబా భక్తులు అడుగడుగున బాబాకు దివ్య మంగళ హారతులు పట్టి, దర్శించుకున్నారు. సత్యసాయి సంస్థ సభ్యులు భక్తులకు బాబా విభూది, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మధుసూదన్, చంద్రశేఖర్, అర్మగం తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి రూ.8.94 లక్షల ఆదాయం



వేలం పాటల్లో పాల్గొన్న కాంట్రాక్టర్లు

గుడుపల్లె గుడివంక శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి అంగళ్ల గేటు వేలం పాటల ద్వారా రూ.8.94 లక్షల ఆదాయం వచ్చింది. మంగళవారం గుడివంక ఆలయం వద్ద దేవదాయ శాఖ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాలు నిర్వహించే సమయంలో హక్కుకు మాత్రమే వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాట పాడేవారు రూ.10 వేలు డిపాజిట్ చేసి, వేలం పాట పాడారు. వేలం పాటలో లడ్డు ప్రసాదం విక్రయ హక్కులు రూ.5.55 లక్షలు, అంగళ్ల గేటు వసూలుకు రూ.1.34 లక్షలు, తలనీలాల సేకరణకు రూ.2.05 లక్షలు వేలం పాటలు పాడారు. అలాగే గంగాధరేశ్వరస్వామి ఆలయం వద్ద లడ్డూ ప్రసాదం విక్రయానికి రూ.40 వేలు, అంగళ్ల గేటు రూ.60 వేలు, వాహనాలు గేటు రూ.56 వేలు, తలనీలాలు సేకరణ రూ.1.16 లక్షలకు పాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కమాలకర్, నాయకులు బాబు నాయుడు, ఆర్ చంద్రశేఖర్ హేమాంబరగౌడు, రాజగోపాల్, వెంకటేశుగౌడు, డీకే చంద్రశేఖర్, అర్చకులు వీరశేఖరయ్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: అన్ని రంగాల్లో యువ పారిశ్రామిక వేత్తలు అభివృద్ధి చెందాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. మంగళవారం కడా కార్యాలయ ఆవరణలో ఎంటర్‌ప్రెనర్‌షిప్ డెవలప్ మెంట్ ప్రోగామ్ ద్వారా యువతకు అవగాహన కల్పించారు. వ్యాపారం ప్రారంభానికి అవసరమైనా దశలు, ప్రాజెక్టు రిపోర్టు తయారీ, రుణాలు లభ్యత, మార్కెటింగ్ డిమాండ్, డిజిటల్ మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ ఎలా పొందాలన్న అంశాలపై కూడా అవగాహన కలిపించడంతోపాటు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో యువత పారిశ్రామికవేత్తలు అభివృద్ధి సాధించి, పలువురికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వన్‌సైడ్ పార్కింగ్ పటిష్టంగా అమలు చేస్తాం

పలమనేరు: పట్టణంలో రద్దీగా ఉన్న వీధుల్లో ఇకపై వన్‌సైడ్ పార్కింగ్ పటిష్టంగా అమలు చేస్తామని ఎస్ఐ లోకేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బజారువీధి, జవుళీవీధి, మెయిన్‌రోడ్డు, టీకే వీధి, శివాలయం వీధుల్లో ట్రాఫిక్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో నోపార్క్ జోన్లలో సైతం వాహనాలను ఆపుతున్నారని తెలిపారు. ఇకపై వన్‌సైడ్ పార్కింగ్ పటిష్టంగా అమలు చేస్తామని, ఇందుకు దుకాణ యజమానులు సైతం సహకరించాలన్నారు. వాహన చోదకులు సైతం ఓ పక్క వాహనాలను పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు వీలుంటుందని సూచించారు.

మాజీ సీఎం జగన్‌తో శ్రీదేవిరెడ్డి భేటీ



మాజీ సీఎం జగన్‌తో శ్రీదేవి రెడ్డి, వసుంధర రెడ్డి

రొంపిచెర్ల: మండలంలోని దుస్సావాండ్లపల్లెకు చెందిన హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కమలాపురం శ్రీదేవిరెడ్డి, సోషల్ యాక్టివిస్ట్ వసుంధరరెడ్డితో కలసి మంగళవారం తాడేపల్లెలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఎండోసోల్ పరిశ్రమకు ఏపీ ప్రభుత్వం కరేడు గ్రామ పరిధిలో 8,500 ఎకరాల భూములను ఇవ్వాలని ప్రయత్నాలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో 5 వేల ఎకరాల భూములను ఇచ్చినట్లు తెలిపారు. అయితే మళ్లీ చంద్రబాబు అక్కడ ఇచ్చిన భూములు కాదని, పంటలు సాగు చేసుకుంటున్న రైతుల వద్ద బలవంతంగా భూములను లాకోవాలని చూస్తున్నారన్నారు. దీనిని అడ్డుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి వారిని అభినందించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌడేపల్లె: శెట్టిపేట ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ మంగళవారం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్ కార్యక్రమంతోపాటు మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధ్రువపత్రాల మంజూరు

పుంగనూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం సదరన్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరగోపాల్ ఆధ్వర్యంలో అర్థోపెడిక్ సర్జన్ మధుమోహన్ రోగులను పరిశీలించి, వారి వైకల్యాలను పరిశీలించి ధ్రువ పత్రాలను మంజూరు చేశారు.

డిగ్రీ కళాశాలలో బయట వ్యక్తులపై నిఘా

పుంగనూరు: పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాలలో బయట విద్యార్థులు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తుండటంపై పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇబ్బందులపై పట్టణ సీఐ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై పోలీసులు కళాశాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిఘా పెట్టినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. బయట విద్యార్థులు కళాశాలలోకి వచ్చి ఇబ్బందులు కలిగిస్తే పోలీస్ కేసుల్లో చిక్కుకుంటారని, ఈవిషయంలో బయట విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

గోకులం షెడ్లు మంజూరు

శాంతిపురం: మండలంలోని పాడి రైతులకు రెండో విడతగా 130 గోకులం షెడ్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.3 కోట్ల విలువైన ఈ షెడ్ల నిర్మాణం త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మొదటి విడతలో మంజూరైన 126 షెడ్ల నిర్మాణం పూర్తి కాగా ఇప్పటి వరకూ రూ.1.10 కోట్ల బిల్లులు రైతులకు చెల్లించామని, మిగిలిన రూ.1.76 కోట్లను వెంటనే చెల్లిస్తామని తెలిపారు. అబకలదొడ్డి వద్ద ఉన్న దామలచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ మంగళవారం పరిశీలించారు. కూలీలకు రోజుకు రూ.300 వేతనం లభించేలా పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు.

రెవెన్యూ లీల.. రాజకీయ గోల



రెవెన్యూ లీలలు ఊరూరా బయట పడుతున్నాయి. రాజకీయ గోలతో ఎక్కడికక్కడ బాధితులకు అన్యాయం జరుగుతోంది. కూటమి నేతల ఒత్తిళ్లు.. అధికారుల స్వార్థంతో బాధితులు నష్టపోతున్నారు. ద్వితీయ శ్రేణి కూటమి నేతలకు భయపడి అక్రమాలకు వంతపాడుతున్నారు. ఫలితంగా బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

పచ్చనేతల గుప్పిట్లో రెవెన్యూ!

- ఆయా మండల నేతలు చెప్పినట్టు చేయాల్సిందే
- సివిల్ సమస్యల్లో బాధితులకందని న్యాయం
- న్యాయస్థానాలకు ఆశ్రయిస్తున్న బాధితులు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ అధికారులు పచ్చ నేతల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారనే మాట వినిపిస్తోంది. రెవెన్యూ కార్యాలయానికి ఎవరు ఏ సమస్యపై వచ్చినా ముందుగా ఆ మండలంలోని నేతలను కలిసి సిఫారస్సు చేసుకురావాలని అధికారులే పురమాయిస్తున్న పరిస్థితి పలమనేరు నియోజకవర్గంలో నెలకొంది. కాదు.. కూడదు అంటే ఆ అధికారిపై బదిలీ వేటో.. లేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు తప్పడం లేదు. దీంతో కిందిస్థాయి వీఆర్వో నుంచి తహసీల్దార్ వరకు పచ్చనేతలు చెప్పినట్టు తలూపాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పోనీ ఆర్డీఓ కార్యాలయంలోనైనా న్యాయం జరుగుతుందేమో అనుకుంటే అక్కడ కూడా కొందరు అధికారులు నేతల మాట జవదాటడం లేదు. ఉన్నతాధికారుల వద్ద కెళ్లినా లాభం లేక విధిలేని పరిస్థితుల్లో బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తమకు అనుకూలమైన వారినే వేసుకున్నారు

అత్యంత ముఖ్యమైన శాఖ రెవెన్యూనే. దీంతో గతంలో జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో ఆయా మండలాల్లో నాయకులు తమకు అనుకూలమైనా వారికి పోస్టింగులు వచ్చేలా కలెక్టర్ స్థాయి నుంచి చెప్పించి మరీ చేసుకున్నారు. కొన్ని మండలాల్లో రెగ్యులర్ తహసీల్దార్లకు కాకుండా డీటీలనే ఎఫ్ఏసీ తహసీల్దార్లుగా పెట్టుకున్నారు. నేతల సిఫార్సులతో పోస్టింగ్‌లో చేరిన అధికారులు విధుల్లో చేరిన వెంటనే ఆయా మండలాల్లోని పచ్చనేతలను కలిసి శుభాకాంక్షలు తెలిపి, మరీ ప్రసన్నం చేసుకున్నారు. దీంతో ఏ పని చేయాలన్నా ముందుగా అన్న చెప్పినట్టు సార్లు ఫాలో అవుతున్నారనే విమర్శలున్నాయి.

క్లస్టర్ లీడర్ నుంచి మండల కీలకనేత ద్వారా..

ఆయా మండలాల్లో ఏ గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లినా ముందుగా ఆ పంచాయతీ ఇన్‌చార్జ్(టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్) చెప్పాలి, మళ్లీ మండల నేత అధికారులకు సూచనలు చేస్తారు. వారు చెప్పినట్టుగా రెవెన్యూ యంత్రాంగం ముందుకెళుతుంది. అన్ని కార్యాలయాల్లో కూటమి నేతలు ఈ విధానాన్ని మాత్రం తు.చ. తప్పకుండా పటిష్టంగా అమలు చేయిస్తున్నారు. కొన్ని సంఘటనల్లో సివిల్ వివాదాల్లోకి ఆయా మండల నేత సిఫార్సుతో పోలీసులు సైతం తలదూర్చుతుండడం గమనార్హం. అటు రెవెన్యూ, ఇటు పోలీసుశాఖలోనూ న్యాయం జరగక బాధితులు ఇటీవల కోర్టు బాట పడుతున్న సంఘటనలు ఉన్నాయి.

ఇవిగో సాక్ష్యాలు..

- బైరెడ్డిపల్లి మండలం బెల్లంమొడుగు గ్రామానికి చెందిన ప్రకాష్‌రెడ్డి కుటుంబసభ్యులు డీకేటీ భూమి సామల చెంగారెడ్డి పేరిట పట్టా వచ్చి ఆపై వారసులకు వచ్చింది. ఇందుకు సంబంధించిన రికార్డులున్నాయి. అయితే రెవెన్యూ అధికారులు ఆ డీకేటీ పట్టా అదే పేరున్న ఆ గ్రామానికే చెందిన మరో వ్యక్తిదిగా తేల్చారు. దీంతో బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా మండల నేత సిఫార్సు లేక వారికి న్యాయం జరగలేదు. ఈ నేపథ్యంలో ఎప్పుడో మృతి చెందిన వ్యక్తికి బతికున్నట్టుగా పట్టా ఎలా ఇస్తారని బాధితులు ప్రశ్నించినా లాభం లేక హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ కేసులో జిల్లా అధికారుల నుంచి తహసీల్దార్ వరకు విజయవాడలోని హైకోర్టుకు వెళ్లాల్సి వచ్చింది.
- బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డికి చెందిన నాగరాజు అనే బాధితుడు తమ భూమికి దారి లేకుండా చేశారని రెవెన్యూ అధికారులకు అర్జీ ఇస్తే అధికారపార్టీ నేత సిఫార్సు లేదని అధికారులు పట్టించుకోలేదు. దీంతో బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు.
- రామాపురానికి చెందిన రామరాజుకు ఇలాంటి ఘటనే జరిగింది. కోర్టులో కేసున్నప్పటికీ అధికారులు ఇబ్బంది పెట్టి తనను మనోవేదనకు గురిచేశారని బాధపడ్డారు.
- కురప్పలికి చెందిన సుధాకర్‌దీ ఇలాంటి సమస్యే. పలమనేరు మండలం కల్లాడుకు చెందిన సుబ్రమణ్యం రెడ్డి సైతం తన భూమిలో ఎక్స్‌ప్రెస్‌హైవే నష్ట పరిహారం కోసం స్థానిక కార్యాలయంలో న్యాయం జరక్క అధికారులను సవాల్ చేస్తూ హైకోర్టుకెళ్లి న్యాయం పొందాడు. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లోనూ జరుగుతోంది. న్యాయం ఉన్నప్పటికీ అన్యాయం జరుగుతున్న బాధితులు ఎవరికీ చెప్పుకోలేక, విధిలేక కోర్టులకెళ్లాల్సివస్తోందనే మాట వినిపిస్తోంది.

ఎస్‌ఐగా హరిప్రసాద్



పుంగనూరు సీఐ సుబ్బరాయుడిని కలిసిన నూతన ఎస్ఐ హరిప్రసాద్

పుంగనూరు: అర్బన్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా హరిప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ లోకేష్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు వీఆర్‌లో ఉన్న హరిప్రసాద్‌ను అర్బన్ ఎస్‌ఐగా నియమిస్తూ ఎస్పీ మణికంఠ చందవోలు ఆదేశాలు జారీ చేశారు. ఆయన సీఐ సుబ్బరాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బందితో సమావేశమై ట్రాఫిక్ గురించి, శాంతి భద్రతల గురించి పలు సూచనలు చేశారు.